అకాల వర్షం.. తడిసిన ధాన్యం

- కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో రాశులు
- నిర్వాహకుల లోపంతో వర్షార్పణం
- తడిసినా కొనుగోలు చేయాలని రైతుల డిమాండ్



దమ్మపేట మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యపు రాశులు



ములకలపల్లి మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు

నత్తనడకన ధాన్యం తరలింపు..

ములకలపల్లి: ములకలపల్లిలో సోమవారం ఉదయం భారీ వర్షం కురిసింది. మండలవ్యాప్తంగా కురిసిన వర్షానికి కల్లాల్లో ఆరబోసిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతన్నలు నానాతంటాలు పడ్డారు. పలువురి పంట తడిసి ముద్దయిపోవడంతో, మరలా ధన్యాన్ని ఆరబెట్టుకున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తరలింపు నత్తనడకన సాగుతోందని, త్వరితగతిన పంట తరలించేలా చర్యలు తీసుకోవాలని రైతులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

పట్టాలు అందించకపోవడంతో..

దమ్మపేట: అకాల వర్షానికి తోడు టార్పాలిన్ పట్టాలు లేని కారణంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. పట్టాలు కప్పిన రాశుల కిందకు కూడా నీరు చేరుకుని కొంతమేరకు తడిచాయి. ఆదివారం ఉదయం దాదాపుగా అరగంటసేపు ఎడతెరిపి లేకుండా భారీగా వర్షం కురిసింది. గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో దమ్మపేట మార్కెట్ యార్డులో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రంలో, ధాన్యపు రాశులను ఆరబోసిన రైతులకు అవసరమైన మేరకు టార్పాలిన్ పట్టాలను నిర్వాహకులు అందజేయలేదు. ఈ కారణంగా ధాన్యపు రాశులు తడిసిపోయాయి. అలాగే ధాన్యం కాంటా వేసే విషయంలో దళారులు, పరపతి కలిగిన వారికే ముందుగా కాంటా వేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. యార్డుకు ముందుగా ధాన్యాన్ని తరలించిన వారికి సీరియల్ నంబర్లను ఇచ్చి, ఆ మేరకు క్రమ పద్ధతిలోనే ధాన్యమును కాంటా వేయాలని రైతులు కోరుతున్నారు.

సకాలంలో రాని లారీలు..

అశ్వాపురం: మండలంలో ఆదివారం ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కురిసిన వర్షానికి రైతుల ధాన్యం తడిసింది. మండల పరిధిలోని మొండికుంట, మల్లెలమడుగు, బీజీ కొత్తూరు, సీతరాంపురం, రామచంద్రాపురం ధాన్యం కొనుగోలు కేంద్రాలతో పాటు పలు గ్రామాల్లో ఆరబోసి పరదాలు కప్పిన ధాన్యం తడిసింది. ఆరుగాలం కష్టపడి దాన్యం చేతికొచ్చే సమయంలో ధాన్యం తడవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఖాంటాలు పెట్టిన ధాన్యం తరలించేందుకు లారీలు సకాలంలో రాక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

చండ్రుగొండ: అకాల వర్షాలు గాలిదుమారాలు రైతన్నలు కుదేలు చేస్తున్నాయి. ఆదివారం ఉదయం గాలిదుమారంతోపాటు పడిన వర్షంతో అన్నదాతలు పాక్షికంగా నష్టపోయారు. కోతదశలో ఉన్న వరితోపాటు మామిడి పంటకు నష్టం వాటిల్లింది. ధాన్యం రక్షణ కోసం రాసులపై కప్పిన పట్టాలు సైతం బలమైన గాలులకు లేచిపోవడంతో ధాన్యం తడిచి ముద్దయ్యాయి. తడిచిన ధాన్యం ప్రభుత్వ ఎలాంటి ఆంక్షలు లేకుండా కొనుగోలు చేయాలని రైతుసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఎమ్మెల్యే పేరు చెప్తే ఇళ్లు రావు..



కళ్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

అశ్వాపురం: ఎమ్మెల్యే పేరు చెబితే, డబ్బులు ఇస్తే ఇళ్లు రావని.. అర్హులైన నిరుపేదలకే దశల వారిగా ఇందిరమ్మ ఇళ్లు వస్తాయని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని రైతువేదికలో ఆదివారం తహసీల్దార్ స్వర్ణలత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులు లబ్ధిదారులకు ఎమ్మెల్యే పాయం అందజేశారు. డబ్బులు వసూళ్లకు ఎవరైనా పాల్పడితే వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ లావణ్య, నెల్లిపాక పీఏసీఎస్ అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ బేతం రామకృష్ణ, మాజీ జెడ్పీ, మండల కో ఆప్షన్ సభ్యులు షర్ఫియుద్దీన్, ఎస్‌కె.ఖధీర్, మాజీ ఎంపీటీసీ కమటం నరేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, నాయకులు ఓరుగంటి రమేష్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, బూరెడ్డి వెంకటరెడ్డి, కొండబత్తుల ఉపేందర్, ఆవుల రవి, రామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, తెల్లం వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అధ్యక్షుడి నియామకం చెల్లదు



సమావేశంలో పాల్గొన్న బీజేపీ శ్రేణులు

దుమ్ముగూడెం: భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడుగా నియమితులైన త్రినాథ్‌రెడ్డి నియామకం చెల్లదని మండల కమిటీ సభ్యులు ఆరోపించారు. ఆదివారం జరిగిన సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యక్షుడు అపకా శ్రీనివాస్ మాట్లాడుతూ.. మండలంలో ఎవరికి పరిచయం లేని వ్యక్తిని కనీసం ఎన్నికల సమయంలో పోలింగ్ బూతులో కూడా పని చేయని వ్యక్తికి ఎలా మండల అధ్యక్ష పదవి ఇస్తారని ప్రశ్నించారు.

అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు పూర్తయిన తర్వాత గత మండల అధ్యక్షుడు పార్టీకి రాజీనామా చేయగా అప్పటి నుంచి తానే మండలంలో పార్టీ బాధ్యతలు పర్యవేక్షిస్తున్నట్లు, తనకు కాకుండా అనుహ్యంగా త్రినాథ్‌రెడ్డికి మండల అధ్యక్ష పదవిని కట్టబెట్టడం క్యాడర్‌లను విస్మయానికి గురి చేస్తోందన్నారు. తక్షణమే జిల్లా నాయకత్వం ఆలోచన చేసి మండలంలో పార్టీ అభివృద్ధికి కృషి చేసిన వారికి బాధ్యతలు అప్పగించాలని అన్నారు. సమావేశంలో దుమ్ముగూడెం మండలం పార్టీ కార్యకర్తలు,నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కోత

అశ్వారావుపేట: అశ్వారావుపేట మండలం వినాయకపురం ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా సోమవారం వినాయకపురం, నారాయణపురం, గంగారం సబ్ స్టేషన్‌ల పరిధిలో గ్రామాలకు ఉదయం 7గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనున్నట్లు వినాయకపురం సబ్ స్టేషన్ ఏఈఈ సంతోష్ తెలిపారు.

నేడు 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'

అశ్వారావుపేట: రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం 8గంటలకు అశ్వారావుపేట రైతు వేదిక, వినాయకపురం గ్రామపంచాయతీ కార్యాయలంలో రైతులతో శాస్త్రవేత్తలు సంభాషిస్తారని వ్యవసాయ కళాశాల ఆసోసియేట్ డీన్ డాక్టర్ జె.హేమంత్ కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మంత్రి తుమ్మల పరామర్శ

దమ్మపేట: మండలంలోని గండుగులపల్లి గ్రామానికి చెందిన కోటగిరి రామచంద్రరావు అనారోగ్య కారణంగా ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా.. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి గురించి కుటుంబ సభ్యుల ద్వారా తెలుసుకుని, త్వరగా కోలుకువాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొయ్యల అచ్యుతరావు, కాసాని నాగప్రసాద్, వసంతరావు పాల్గొన్నారు.

నూతన చైర్మన్‌కు సన్మానం



ఆదినారాయణను సన్మానిస్తున్న బీసీ సంఘం నాయకులు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని సాయి బాబా వారి ఆలయ కమిటీ నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన కొమ్మనాపల్లి ఆదినారాయణను బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బొలిశెట్టి రంగారావు, తమ్మల వెంకటేశ్వరరావు, తాళ్ల రవికుమార్, బండారు నాగేశ్వరరావు, ఆకోజు సునీల్, నరసింహచారి, శాంతారావు, మల్లు యాదవ్, గంగాధర్, బాలకృష్ణ, పున్నయ్య, రామచంద్ర రావు, పసుపులేటి బాబు, నిర్మలానందం పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడిపై ర్యాలీ

అశ్వాపురం: పహల్గాంలో ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ ముస్లిం మైనార్టీల ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో జామా మసీదు నుంచి బస్టాండ్ సెంటర్ మీదుగా గౌతమీనగర్ కాలనీ గేట్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదం నశించాలి, హిందూ ముస్లిం బాయి బాయి అంటూ నినాదారు చేశారు. కార్యక్రమంలో ముస్లింలు, వారి నాయకులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ జాతర ప్రారంభం

దమ్మపేట: మండల కేంద్రం దమ్మపేట గ్రామంలో ముత్యాలమ్మ తల్లి జాతరను ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఆలయంలో అమ్మవారిని నూతన వస్త్రాలు, పూలు, పండ్లతో ఘనంగా అలంకరించారు. వేద పండితులచే శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించగా.. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, అమ్మవారిని దర్శించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరావు అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ఈ నెల 8 వరకు ఐదు రోజులు పాటు జాతర ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లుగా తెలిపారు.



చండ్రుగొండ: ముత్యాలమ్మ దేవతకు బోనాలు సమర్పించేందుకు వెళ్తున్న మహిళలు

ముత్యాలమ్మకు బోనాలు..

చండ్రుగొండ: మండలంలోని పోకలగూడెం గ్రామంలో ముత్యాలమ్మ దేవతకు ఆదివారం బోనాల పండుగ నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో మహిళలు పెద్ద ఎత్తున బయలు దేరి ఊరేగింపు నిర్వహించారు. అనంతరం దేవత వద్ద భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

భగీరథ మహర్షి జయంతి

దమ్మపేట: భగీరథ మహర్షి జయంతి వేడుకలను మండల సగర సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. దమ్మపేట గ్రామంలోని స్థానిక మార్కెట్ యాడ్ వీధిలో, భగీరథ చిత్రపటానికి పూలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సగర సంఘం సభ్యులు మాట్లాడుతూ.. మండల కేంద్రంలో భగీరథ విగ్రహాన్ని అధికారికంగా ఏర్పాటు చేసి, ఆయన జయంతిని నిర్వహించాలని కోరారు. పెరుమాళ్ల కృష్ణమూర్తి, పందేటి వెంకయ్య, శ్రీను, గండికోట వెంకటేశ్వరరావు, కుప్పాల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

జలగం వెంగళరావు జయంతి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని మాజీ ముఖ్యమంత్రి దివంగత జలగం వెంకళరావు జయంతిని ఆదివారం పట్టణ న్యాయవాదుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీఎంగా నాడు ఆయన చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో న్యాయవాదులు పీవీ రమణారావు, రామంస, అక్తర్ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక ఉపనయనాలు



ఉపనయనాలు నిర్వహిస్తున్న పండితులు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని అంబా సత్రంలో బ్రాహ్మణ అఫీషియల్ ప్రొఫెషనల్స్ వెల్ఫేర్ అసోసియేషన్, బ్రాహ్మణ సంఘాల వేదిక ఆధ్వర్యంలో ఆదివారం సామూహిక ఉచిత ఉపనయనాల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు ఉదయం 7 గంటల 11 నిమిషాలకు వటువులకు ఉపనయన సుముహూర్తం పురోహితులు శాస్త్రోక్తంగా చేశారు. శశికాంత్ శర్మ వశిష్ఠునిగా వ్యవహరించి యజ్ఞోపవీత ధారణ చేసుకున్న 18 మంది వటువులకు గాయత్రీ మంత్రం, బ్రహ్మోపదేశం పౌరోహితులు ఉపదేశించారు. కార్యక్రమంలో రాంప్రసాద్, మోహన్ శర్మ, పలివెల సాంబశివరావు, పీవీ నరసింహారావు, కృష్ణమూర్తి, రామాచార్యులు, రామావజ్జల రవికుమార్, అంబాసత్రం పాఠశాల ఉపాధ్యాయులు శివాజీ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షుడి పర్యటన

అశ్వారావుపేట: ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు దారా రమేష్ ఆదివారం అశ్వారావుపేట మండలంలో పర్యటించారు. స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మానిఫెస్టోలో ప్రకటించిన విధంగా జిల్లా కార్యాలయ భవనానికి స్థల సేకరణ జరిగిందని, తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ శాశ్వత సభ్యత్వాలు 10 ఉచితంగా అందించామని తెలిపారు. వారికి భీమా కూడా వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో మండల, పట్టణ అధ్యక్షులు శీమకుర్తి శ్రీనివాసరావు, లోక్‌నాథ్ గుప్తా, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలుగూరి నగేష్‌కుమార్, జిల్లా కోశాధికారి శీమకుర్తి తాతా శ్రీనివాసరావు, జిల్లా సభ్యత్వ నమోదు కమిటీ చైర్మన్ పల్లెర్ల చంద్రశేఖర్ పాల్గొన్నారు.



అన్నపురెడ్డిపల్లి: సమావేశంలో మాట్లాడుతున్న దారా రమేష్

అన్నపురెడ్డిపల్లి (చండ్రుగొండ): సామాజిక సేవల్లో ఆర్యవైశ్యులు ముందుండాలని ఆర్యవైశ్యమహాసభ జిల్లా అధ్యక్షుడు దార రమేష్ అన్నారు. అన్నపురెడ్డిపల్లిలోని శ్రీవాసవి విగ్నేశ్వర ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. త్వరలోనే కొత్తగూడెంలో సంఘం ఆధ్వర్యంలో మెగాహెల్త్‌క్యాంప్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న అనేక కార్యక్రమాలను ఆయన వివరించారు. జిల్లా నాయకులతోపాటు వనమా గాంధీ, వేముల నగేష్, కేశెట్టి ముక్తేశ్వరరావు, గోళ్ళ పుల్లారావు, ప్రదీప్, శ్రీనివాసరావు, శ్రీను పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

దుమ్ముగూడెం: మండలంలోని నరసాపురం సూదిరెడ్డి నాగిరెడ్డి ఆదిలక్ష్మమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ హైస్కూల్లో 2000–01 పదో తరగతి బ్యాచ్‌కి చెందిన పూర్వవిద్యార్థుల ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆట పాటలతో సరదాగా గడిపారు. 14 సంవత్సరాల తర్వాత ఏర్పాటు చేసుకున్న ఈ ఆత్మీయ సమ్మేళనంలో తమకు విద్యాబోధన చేసిన గురువులకు సన్మానం చేసి వారికి జ్ఞాపికలను అందజేశారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ముగ్గురు స్నేహితుల కుటుంబాలకు ఆర్థిక సాయం చేశారు.

ప్రయాణికుల జేబుకు చిల్లు

- బస్టాండ్‌లోని దుకాణాల్లో అధిక ధరలు
- ఎమ్మార్పీని ఉల్లంఘిస్తున్న విక్రయదారులు
- ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోని అధికారులు



భద్రాచలం బస్టాండ్‌లోని ఓ దుకాణం..

భద్రాచలం ఆర్టీసీ బస్టాండ్‌లో గత నెల ఒరిస్సా నుంచి వైద్యం నిమిత్తం పడిమల్ అనే వ్యక్తి తన కుటుంబ సభ్యులతో కలిసి భద్రాచలం వచ్చాడు. ఎండ వేడిని తట్టుకునేందుకు బస్టాండ్‌లో ఉన్న ఓ బేకరిలో రెండు ఆఫ్ లీటర్ మాజాను కొనుగోలు చేశారు. ఇందుకుగాను స్టాల్ నిర్వహకురాలు ఒక్కో మాజా డ్రింక్‌పై ఉన్న ఎమ్మార్పీ ధర రూ.40 తీసుకోవాల్సి ఉన్నప్పటికీ రూ.50 లు వసూలు చేసింది.

దుమ్ముగూడెంకు చెందిన మరో వ్యక్తి మరో స్టాల్‌లో ఒక లీటర్ వాటర్ బాటిల్ కొనుగోలు చేయగా.. రూ.20 తీసుకోవాల్సిన దగ్గర రూ.25లు వసూలు చేశారు. అనంతరం భద్రాచలంకు చెందిన ఓ వ్యక్తి పనిమీద బస్టాండ్‌కు రాగా.. ఇదే స్టాల్‌లో ఒక పావు లీటర్ మాజాకు నిర్వహకులు రూ.20కి బదులు రూ.25 వసూలు చేశారు. ఈ వ్యక్తి ప్రశ్నించగా.. కూలింగ్ పెట్టాం కాబట్టి అదనంగా తీసుకుంటున్నామని చెప్పుకొచ్చారు.

ఇది ఈ ముగ్గురి సమస్య మాత్రమే కాదు.. భద్రాచలం బస్టాండ్‌లో కొనుగోలు చేసే ప్రతీ ప్రయాణికుడి సమస్య...


భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఆర్టీసీ బస్టాండ్‌లో కొందరు దుకాణదారులు ధనార్జనే లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రయాణికులను నిలువు దోపిడీ చేస్తున్నారు. అధిక ధరలకు తినుబండారాలు, శీతల పానీయాలు తదితరాలను విక్రయిస్తున్నారు. ఈ తంతు నిత్యం జరుగుతున్నా, చోద్యం చూడటం అధికారుల వంతవుతోంది.

భద్రాచలం బస్టాండ్‌లో 16 దుకాణాలున్నాయి. నిత్యం దాదాపు 91 బస్సుల్లో 25 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ బస్టాండ్‌లోపల ఏర్పాటు చేస్తున్న దుకాణాల్లో తినుబండారాలు, కూల్‌డ్రింక్స్ తదితర వాటిని విక్రయిస్తున్నారు. కాని వాటిపై ఎమ్మార్పీ ధరలకు మించి వసూలు చేస్తున్నారు. చివరి నిమిషంలో హడావుడిగా వచ్చే ప్రయాణికులు తమ బస్సు మిస్సవుతుందనే ఉద్దేశంతో అధిక ధరలను వెచ్చించి వీటిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. కొన్ని సందర్భాల్లో ఎవరైనా ప్రశ్నిస్తే, ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండంటూ నిర్వాహకులు నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారు. వాస్తవానికి ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణంతో పాటు నిర్ణీత ధర, నాణ్యతతో కూడిన ఆహారాన్ని అధికారులు అందించాల్సి ఉన్నా.. ఆ దిశగా చర్యలు చేపట్టడంలో విఫలమవుతున్నారు.

అన్నింట్లోనూ అధికమే...

భద్రాచలంలో బస్టాంలోని దుకాణాల్లో అధిక ధరలు వసూలు చేస్తున్నారనడానికి అనేక ఉదాహరణలు ఉన్నాయి. ఇక్కడ రూ.రెండుకు విక్రయించాల్సిన వాటర్ ప్యాకెట్‌ను రూ.నాలుగుకు అమ్ముతున్నారు. రూ.20 విలువజేసే కూల్ డ్రింక్ కావాలంటే రూ.25 చెల్లించాల్సిందే. రూ.20 బిస్కెట్ ప్యాకెట్ రూ.22కు, రూ.20 లేస్ ప్యాకెట్‌ను రూ.22కు విక్రయిస్తున్నారు.


అధికారుల పర్యవేక్షణ అవసరం



భద్రాచలం ఆర్టీసీ బస్టాండ్‌లో అధిక ధరలకు తిను బండారాలను విక్రయిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే ఈ పరిస్థితి ఏర్పడుతోంది. వాటర్ బాటిల్‌పై రూ.ఐదు అదనంగా వసూలు చేస్తున్నారు. ప్రతి వస్తువులోనూ ఇదే తీరును అవలంబిస్తున్నారు. అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నా.. ఏ మాత్రం భయ పడటంలేదు. ఇప్పటికైనా వారు స్పందించి చర్యలు చేపట్టాలి.

– మారం శ్రీనివాసరెడ్డి , భద్రాచలం

పరిశీలించి చర్యలు చేపడతాం..



ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయించకూడదు. వీటిపై ఫిర్యాదులొచ్చిన వెంటనే స్పందించి చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే స్టాల్స్ నిర్వాహకులకు సమావేశాలు నిర్వహిస్తాం. ప్రయాణికుల వద్ద నుంచి అధిక ధరలు వసూలు చేస్తే ముందుగా ఫైన్ వేసి, తదుపరిగా క్రాంటాక్ట్‌ను రద్దు చేస్తాం. ఇప్పటికే నిబంధనలు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై ఫైన్‌లు వేశాం.

– తిరుపతి, ఆర్టీసీ డిపో మేనేజర్, భద్రాచలం

క్లుప్తంగా

ప్రభుత్వాస్పత్రిలో పెరిగిన ప్రసవాలు

అశ్వారావుపేట: అశ్వారావుపేట ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాలు గణనీయంగా పెరిగాయని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాధా రుక్మిణి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. గతంలో నెలకు పది ప్రసవాలు జరుగుతుండగా.. ప్రస్తుతం 23కు చేరాయన్నారు. వీటిలో 16 సుఖ ప్రసవాలు కాగా కేవలం 7మాత్రమే ఆపరేషన్లు జరిగాయన్నారు. గతంలో స్పెషలిస్ట్ డాక్టర్‌ల కొరత ఉండేదని.. ప్రస్తుతం ఆ సమస్య లేదన్నారు. ప్రస్తుతం ఇద్దరు ప్రసూతి వైద్యులు, ఇద్దరు మత్తు వైద్యులు, ఒక చిన్నపిల్లల వైద్య నిపుణులు, నలుగురు ఎంబీబీఎస్ వైద్య నిపుణులున్నారన్నారు. ప్రసవాలు పెరగడం పట్ల టీవీవీపీ కమిషనర్ అజయ్‌కుమార్, జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, డీసీహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు హర్షం వ్యక్తం చేసినట్లు తెలిపారు.

వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం

చండ్రుగొండ: మండలంలోని మద్దుకూరు గ్రామ శివారులో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం శనివారం రాత్రి వైభవోపేతంగా నిర్వహించారు. వందలాది మంది భక్తులు వీక్షిస్తుండగా వేదమంత్రోత్సరణ నడుమ కల్యాణ క్రతువు జరిపించారు.

కరాటే శిక్షణ ప్రారంభం



శిక్షణను పరిశీలిస్తున్న సీఐ నాగరాజు

అశ్వారావుపేట: అశ్వారావుపేటలో ఉచిత కరాటే శిక్షణా శిబిరాన్ని సీఐ నాగరాజు ఆదివారం ప్రారంభించారు. కరాటే శిక్షకుడు గద్దం వెంకన్నబాబు ఆధ్వర్యంలో నెల రోజుల పాటు ఈ శిక్షణా శిబిరం నిర్వహించనున్నారు. కరాటే క్రమశిక్షణను, ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడానికి ఉపయోగపడుతుందని, యువత ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సీఐ ఈ సందర్భంగా సూచించారు.

ఆలయ ప్రారంభోత్సవం

దుమ్ముగూడెం: మండలంలోని పెద్దనల్లబల్లి గ్రామంలో బంగారు ముత్యాలమ్మ తల్లి అమ్మవారి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పాల్గొని ప్రత్యేక పూజలను చేశారు. నూతన ఆలయాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మట్టా శివాజీ, కణితి సమ్మయ్య, గ్రామస్తులు పుట్టా శ్రీరామ్మూర్తి, మట్టా శేఖర్ పాల్గొన్నారు.

మద్దతు ధర ఇవ్వాలి

ములకలపల్లి: అకాల వర్షాలతో తడిసిన ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధర ఇవ్వాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ అనుబంధ రైతుసంఘ జిల్లా నాయకులు నకిరకంటి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మండలపరిధిలోని కమలాపురంలో తడిసిన ధాన్యపు రాశులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ఆరుగాలం శ్రమించి, పండించిన పంట చేతికొచ్చే దశలో తడిసి ముద్దయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎటువంటి కొర్రీలు పెట్టకుండా బేషరతుగా ధాన్యం కొనుగోలు చేయాలని అన్నారు, నవ్వల శివ, రైతులు నకిరకంటి ప్రసాద్, కుక్కమూడి రాములు, బైటి ప్రసాద్, నరేందర్, కొట్టే బాబు తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్లు అందడం లేదు

ములకలపల్లి: అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందడంలేదని బీఆర్ఎస్ కమలాపురం గ్రామకమిటీ సభ్యుడు ఊరబెద్ది వెంకన్న ఆరోపించారు. అఖిలపక్ష నాయకులతో కలసి సోమవారం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికార పార్టీల నేతల సూచనల మేరకు ఇష్టారీతిన ఇళ్లు మంజూరు చేస్తున్నారని విమర్శించారు. సీపీఎం మండల కమిటీ సభ్యులు గొగ్గెల ఆదినారాయణ, కుంజా రామ్మూర్తి, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ గ్రామశాఖ కార్యదర్శి నకిరకంటి నాగేశ్వరరావు, జనసేన మండల ప్రధాన కార్యదర్శి గొల్ల వీరభద్రం, గ్రామకమిటీ కార్యకర్త సున్నం వీరభద్రం పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్ మంజూరుపై హర్షం

మణుగూరుటౌన్: మండలంలోని వాసవీనగర్‌లో వాటర్ ట్యాంక్ నిర్మాణానికి నిధులు మంజూరును హర్షిస్తూ వాసవీనగర్ ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమస్యను అర్థం చేసుకుని వాటర్ ట్యాంక్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యేకు స్థానికులు ధన్యవాదాలు తెలుపుతూ ప్రజాభవన్‌లో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కత్తిరాము, వందనపు వాసు, చిట్టూరు శేషుబాబు, బండారు నర్సింహారావు, అరవింద్, సుగ్గల భాను, సూర్యం తదితరులు ఉన్నారు.